క్లుప్తంగా...

కరెంట్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: మరమ్మతులు, చెట్ల కొమ్మల నరికివేత కారణంగా మంగళవారం మేడ్చల్ పట్టణంలో పలు కాలనీల్లో కరెంట్ సరఫరా ఉండదని ఏఈ శశిధర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని కేఎల్‌ఆర్–1, 2, 3 ఫేజ్‌లలో, శ్రీకాలనీ, రాఘవేంద్రనగర్, కిష్టాపూర్ రోడ్డు, ఎన్‌జీఓ కాలనీ, ఏకలవ్యనగర్‌లలో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదని తెలిపారు.

మహేశ్వర్‌రెడ్డికి భౌతికశాస్త్రంలో డాక్టరేట్



కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని లావణ్య రెసిడెన్సీ నివాసి మహేశ్వర్‌రెడ్డికి భౌతికశాస్త్రంలో సోడియం బ్యాటరీస్‌పై పరిశోధన చేసినందుకు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ అందజేసింది. ఈ మేరకు సోమవారం నాగారంలోని లావణ్య రెసిడెన్సీలో ఆయనను మున్సిపల్ వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అపార్ట్‌మెంట్ అసోషియేషన్ అధ్యక్షుడు వెంకట్రావు, సాయికృష్ణాప్రసాద్, అరుణ్‌కుమార్ రెడ్డి, భరత్, అపార్ట్‌మెంట్ వాసులు పాల్గొన్నారు. మహేశ్వర్‌రెడ్డి ఘట్‌కేసర్‌లోని శ్రీనిధిలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

ఎనిమిది మంది బైండోవర్



నేరస్తులకు అవగాహన కల్పిస్తున్న సీఐ సీతారాం

జవహర్‌నగర్: జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పలు కేసుల్లో ప్రమేయం ఉన్న ఎనిమిది మందిని సోమవారం కాప్రా తహసీల్దార్ మతిన్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ సీతారాం తెలిపారు. అనంతరం వారు నేరస్తులకు అవగాహన కల్పించారు. ఎన్నికల సంఘం నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు.

హకీంపేట్‌లో సుభవర షాపింగ్ మాల్



మాల్‌ను ప్రారంభిస్తున్న నటి అనసూయ

శామీర్‌పేట్: నగర శివారులోని హకీంపేట్‌లో సుభవర షాపింగ్ మాల్‌ను సోమవారం సినీ నటి అనుసూయ ప్రారంభించారు. కార్యక్రమంలో మాల్ యాజమాన్యం, తూంకుంట మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

వైన్‌షాపుల వారికి నగదు అనుమతించాలి

ఉప్పల్: ఎలక్షన్ కోడ్ పేరిట ఎస్‌వోటీ పోలీసులు వైన్‌షాపుల నుంచి తీసుకెళ్తున్న నగదును జప్తు చేయడాన్ని నిరసిస్తూ సోమవారం ఉప్పల్ పరిధిలోని దాదాపు వైన్ షాపులను మూసివేసి నిరసన తెలిపారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్‌కు అందజేశారు. వైన్‌షాపు యాజమానులు మాట్లాడుతూ రాచకొండ కమిషనరేట్ పరిధిలోని పలు వైన్‌షాపుల వ్యాపారం పూర్తికాగానే రాత్రి సమయంలో బయటకు తీసుకువెళ్తున్న నగదును ఎస్‌వోటీ అధికారులు సీజ్ చేస్తున్నారని, దీంతో వ్యాపార లావాదేవిలు నిలిచిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉప్పల్ పరిధిలోనే రెండు రోజుల్లో దాదాపు రూ.30 లక్షలకు పైగా నగదు సీజ్ చేశారని అన్నారు. డబ్బు తీసుకువెళ్లే సమయంలో షాప్ లైసెన్స్, ఐడీ కార్డులను చూపించే విధంగా అనుమతించాలని కోరారు.

కస్టోడియన్ ల్యాండ్ ఆక్రమణకు యత్నం

కాప్రా: కాప్రా డివిజన్ సాకేత్ సమీపంలో ప్రభుత్వ ఆధీనంలోని కస్టోడియన్ భూములను ఆక్రమించేందుకు యత్నించారు. 141, 142, 143 సర్వే నంబర్లలోని 18 ఎకరాల 35 గుంటల భూమిలో సోమవారం కొందరు వ్యక్తులు చదును చేస్తున్న విషయాన్ని తెలుసుకున్న కాప్రా మండల రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. కాప్రా మండల తహసీల్దార్ ఎస్.మతిన్ మీడియాకు తెలుపుతూ.. ప్రభుత్వ భూమి అయిన కస్టోడియన్ భూములు ఆక్రమణకు గురవుతున్నాయనే సమాచారం మేరకు ఆర్‌ఐ శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బందిని పంపి పరిశీలించినట్లు తెలిపారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించి, భూఆక్రమణకు యత్నిస్తూ ప్రభుత్వ భూమిలో కొందరు జేసీబీలతో చదును చేస్తుండగా అడ్డుకుని వాహనాలను సీజ్ చేసినట్లు వెల్లడించారు. మండలి రాజు, మరికొందరిపై జవహర్‌నగర్ పీఎస్‌లో కేసు నమోదైనట్లు పేర్కొన్నారు.

నాడు మిత్రులు.. నేడు ప్రత్యర్థులు

- ఆనాడు ఒకే పార్టీలో పెరిగిన మల్లారెడ్డి, వజ్రేష్‌యాదవ్
- 2014లో ఎంపీగా గెలిచిన మల్లారెడ్డి, ఎమ్మెల్యేగా ఓడిపోయిన వజ్రేష్‌యాదవ్
- నేడు ఎమ్మెల్యే పదవి కోసం ఒకరిపై ఒకరు పోటీ



మేడ్చల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి మల్లారెడ్డి



మేడ్చల్ కాంగ్రెస్ అభ్యర్థి వజ్రేష్ యాదవ్

మేడ్చల్: మేడ్చల్ రాజకీయం రోజురోజుకూ ఆసక్తికరంగా మారుతోంది. ప్రధాన పార్టీలైన బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లు రాబోయే ఎన్నికల్లో పోటీ చేసేందుకు తమ పార్టీ అభ్యర్థులను ప్రకటించగా బీజేపీ ఇంకా పెండింగ్‌లో పెట్టింది. బీఆర్‌ఎస్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న మంత్రి చామకూర మల్లారెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థిగా తోటకూర వజ్రేష్ యాదవ్‌ను ప్రకటించింది.

ఇద్దరూ ఒకే పార్టీలో పుట్టి పెరిగి..

బీఆర్‌ఎస్ అభ్యర్థి మల్లారెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి వజ్రేష్‌యాదవ్ నాడు ఒకగూటి పక్షులే.. ఇద్దరు నేతలు టీడీపీలోనే రాజకీయ ఓనమాలు నేర్చుకున్నారు. మాజీ మంత్రి దేవేందర్‌గౌడ్ అనుచరుడిగా ఉంటూ వజ్రేష్‌యాదవ్ సర్పంచ్ స్థాయి నుంచి ఎమ్మెల్యే స్థాయి వరకు ఎదిగాడు. దేవేందర్‌గౌడ్ శిష్యుడిగా ఉంటూ 2009 ఎన్నికల్లో మేడ్చల్ నుంచి ప్రజారాజ్యం అభ్యర్థిగా పోటీ చేశాడు. అదే ఎన్నికల్లో ప్రస్తుతం కాంగ్రెస్ నాయకుడిగా ఉన్న మైనంపల్లి హన్మంతరావు అనుచరుడు నక్క ప్రభాకర్‌గౌడ్ టీడీపీ నుంచి పోటీ చేశారు. 2014 ఎన్నికల్లో టీడీపీ తరఫున పోటీ చేశారు. 2014 పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి స్థానం నుంచి మంత్రి మల్లారెడ్డి టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి బీఆర్‌ఎస్ అభ్యర్థి మైనంపల్లి హన్మంతరావుపై విజయం సాధించారు. 2014 పార్లమెంట్ ఎన్నికల్లో తోటకూర, చామకూర నినాదం ప్రజల్లోకి బాగా వెళ్లింది. మంత్రి మల్లారెడ్డి నాటి ఎన్నికల ప్రచారంలో తోటకూర, చామకూర కలిపి తినండి కమ్మగా ఉంటుంది అంటూ మాస్ డైలాగులు వేస్తూ ప్రచారం నిర్వహించగా మల్లారెడ్డి ఎంపీ అభ్యర్థిగా గెలవగా, వజ్రేష్‌యాదవ్ ఎమ్మెల్యేగా ఓడిపోయారు.

నేడు ప్రత్యర్థులుగా..

నాడు ఒకే పార్టీలో ఉంటూ మిత్రులుగా ఉన్న వజ్రేష్, మల్లారెడ్డిలు నేడు మారిన రాజకీయ పరిణామాలతో ఎన్నికల కదన రంగంలో ప్రత్యర్థులుగా మారారు. మంత్రి మల్లారెడ్డి బంగారు తెలంగాణ సాధన కోసం టీడీపీ నుంచి బీఆర్‌ఎస్‌లోకి చేరి ఆ తర్వాత 2018లో బీఆర్‌ఎస్ టికెట్ సాధించి ఎమ్మెల్యేగా గెలుపొంది ఏకంగా మంత్రి అయ్యారు. తాజాగా మేడ్చల్ నుంచి రెండవసారి బీఆర్‌ఎస్ తరఫున పోటీ చేసేందుకు ఆయన టికెట్ సాధించారు. సీఎం కేసీఆర్ చేతులమీదుగా సోమవారం బీ ఫారం కూడా అందుకున్నారు.

టీడీపీ కనుమరుగు కావడంతో..

తెలంగాణలో టీడీపీ కనుమరుగు కావడం, మాజీ మంత్రి దేవేందర్‌గౌడ్ అనారోగ్యంతో మంచం పట్టడంతో జంగయ్యయాదవ్ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వెంట నడిచారు. ఆయన వెంట కాంగ్రెస్‌లో చేరి మేడ్చల్ కాంగ్రెస్ టికెట్ సాధించి బరిలో నిలిచారు. నాడు టీడీపీ తరఫున పోటీ చేసిన నక్క ప్రభాకర్‌గౌడ్‌ను జంగయ్య వెంట నడిచేలా రాజకీయ పరిస్థితులు చేశాయి. రాజకీయంలో శాశ్వత మిత్రులు ఉండరూ.. శాశ్వత శత్రువులూ.. ఉండరూ అనే నానుడిని ఈ నాయకుల రాజకీయ చరిత్ర స్పష్టం చేస్తుంది.

బీఫారం అందుకున్న మంత్రి మల్లారెడ్డి



మేడ్చల్: మేడ్చల్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి మంత్రి మల్లారెడ్డి తన బీఫారాన్ని ప్రగతిభవన్‌లో సీఎం, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ చేతులమీదుగా సోమవారం అందుకున్నాడు. రెండో విడతలో సీఎం కేసీఆర్ సోమవారం బీఆర్‌ఎస్ అభ్యర్థులకు బీఫారాలను అందజేశారు. అందులో భాగంగా బీఆర్‌ఎస్ అభ్యర్థి మల్లారెడ్డికి అందజేశారు. జిల్లాలోని కుత్బుల్లాపూర్ అభ్యర్థి వివేకానందగౌడ్, కూకట్‌పల్లి అభ్యర్థి కృష్ణారావుకు సీఎం కేసీఆర్ బీఫారాలు అందజేశారు.

శ్రీభవానీ రామలింగేశ్వర స్వామి సేవలో వజ్రేష్‌యాదవ్



కీసరగుట్ట స్వామి సేవలో మేడ్చల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వజ్రేష్‌యాదవ్

కీసర: కీసరగుట్ట శ్రీభవానీ రామలింగేశ్వర స్వామి సేవలో సోమవారం మేడ్చల్ అసెంబ్లీ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్ పాల్గొన్నారు. ఉదయం దేవాలయానికి విచ్చేసిన ఆయనకు దేవాలయ వేదపండితులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. గర్భాలయంలో కొలువైన శ్రీస్వామివారికి ప్రత్యేక పూజల అనంతరం వేదపండితులు స్వామివారి ఆశీర్వచనంతో పాటు మహాప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కీసరగుట్ట శ్రీభవానీ రామలింగేశ్వర స్వామి ఆశీస్సులతో ఈ సారి ఎన్నికల్లో విజయం సాధిస్తానని తెలిపారు. ఆలయ చైర్మన్ తటాకం రమేష్‌శర్మ, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొన్న తరుణ్‌గౌడ్, పార్టీ కీసర మండల అధ్యక్షుడు కోల కృష్ణాయాదవ్, నాగారం మున్సిపల్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి, భోగారం గ్రామ సర్పంచ్ సుంకరి కవితాజైహింద్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తటాకం అభిలాష్, కాంగ్రెస్ నేతలు ముత్యాలు, చిక్కుడు రమేష్, వెంకటేష్, ప్రభాకర్, హరిబాబు, మధు, ప్రవీణ్, రమేష్, మల్లేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా విధులు నిర్వర్తించాలి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.గౌతమ్



సాక్షి, మేడ్చల్ జిల్లా: ఎన్నికల నేపథ్యంలో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా నోడల్ అధికారులు తమకు కేటాయించిన విధులను ఎంతో బాధ్యతాయుతంగా నిర్వర్తించి ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సమన్వయంతో పని చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.గౌతమ్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం స్వీప్, ఫిర్యాదులు, ఎన్నికల ఖర్చులు, ఎన్‌ఐసీ, ఎంసీఎంసీ, ఎంసీసీ నోడల్ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఎన్నికల సమయంలో ఇప్పటి వరకు వచ్చిన ఫిర్యాదులు ఎన్ని అని లా ఆఫీసర్ చంద్రావతిని జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ అడిగారు. ఏ రోజుకు ఆరోజు వచ్చిన ఫిర్యాదులపై అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచేలా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. యువత ఓటు వేసేలా చూడాలన్నారు. ఓటుపై యువతీ యువకులకు అవగాహన కల్పించాలన్నారు. ఎంసీఎంసీ ఆధ్వర్యంలో మీడియా మానిటరింగ్ కమిటీ ఇప్పటి వరకు చేపట్టిన అంశాలపై డీపీఆర్వోను అడిగి తెలుసుకున్నారు. మోడల్ కండక్ట్ ఆఫ్ కోడ్ టీమ్స్ పనితీరు, విధులు ఎలా నిర్వహిస్తున్నారని, ఇప్పటి వరకు చేపట్టిన చర్యలేమిటని ప్రశ్నించారు. సమావేశంలో జిల్లా నోడల్ అధికారులు పద్మజారాణి, చంద్రావతి, శ్రీనివాసమూర్తి, కృష్ణారెడ్డి, కిరణ్‌కుమార్, సుహాసిని, భానుప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉడాన్-3 మ్యాగజిన్ ఆవిష్కరణ



ఘట్‌కేసర్: అంకుషాపూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల్ డిగ్రీ, మహిళా డిగ్రీ కళాశాల మ్యాగజిన్‌ను సోమవారం ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా గురుకుల సంస్థల కార్యదర్శి డాక్టర్ నికోలస్ హాజరై ఇబ్రహీంపట్నం కళాశాల విద్యార్థులు, అధ్యాపకుల రచనలతో కూడిన ఉడాన్–3 మ్యాగజిన్‌ను ఆవిష్కరించారు. మూడేళ్లుగా ప్రతి సంవత్సరం మ్యాగజిన్ వేస్తున్నట్లు ఇబ్రహీంపట్నం ప్రిన్సిపల్ హేమమాలిని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాగకల్యాణి, యాదాద్రి ఆర్‌సీఓ రజిని, డిగ్రీ కళాశాల హేమమాలిని, విజయలక్ష్మి, వెంకటేశ్వర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలకు ఏఐ కీలకం



ఘట్‌కేసర్: నూతన ఆవిష్కరణలకు ఆర్టిఫిషల్ ఇంటిలిజెన్స్ అత్యంత కీలకమని ప్రొఫెసర్లు వెంకరమణ, లింగయ్య అన్నారు. వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ(ఏయూ)లో స్కూల్ ఆఫ్ ఫార్మసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌కు సోమవారం ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ఎఫ్‌డీపీ కార్యక్రమాలు శాస్త్రవేత్తలు, అధ్యాపకులు, రీసెర్చ్ స్కాలర్లకు పరస్పర విజ్ఞాన మార్పిడికి మంచి వేదికగా ఉపయోగపడుతుందన్నారు. ఆర్టిఫిషల్ ఇంటిలిజెన్స్(ఏఐ) సహకారంతో డ్రగ్ డిస్కవరీ రంగంలో వినూత్న ఆవిష్కరణలకు బీజం పడుతుందన్నారు. కో కన్వీనర్ కృష్ణప్రసాద్, సునంద, సయ్యద్, నవీన్, ఫరానా, మౌనిక, రాముడు పాల్గొన్నారు.

విదేశీ విద్యకు మార్గం..

సాక్షి, సిటీబ్యూరో: చదువు మాత్రమే కాకుండా కమ్యూనికేషన్ తదితర అంశాల్లో కూడా ప్రావీణ్యం ఉంటేనే అమెరికాలో ఉన్నత విద్యావకాశాలు లభిస్తాయని క్రిమ్సన్ ఎడ్యుకేషన్ సంస్థ కంట్రీ హెడ్ కునాల్ మెహ్రా అన్నారు. నగరంలో ఏర్పాటైన విద్యా సదస్సులో ఆయన మాట్లాడుతూ ఇటీవల నగరం నుంచీ అమెరికా విద్యావకాశాలు పొందిన వారికి డిగ్రీలతో పాటు టెక్, అప్లికేషన్ల అభివృద్ధి, సాఫ్ట్‌వేర్, వెబ్‌సైట్స్ తయారీ, క్రీడలు, కళలు.. తదితర అంశాల్లో ప్రతిభావంతులైన వారేనన్నారు. దీనిపై విద్యార్థుల్లో అవగాహన పెంచడం కోసం నగరంలో సదస్సులు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

గాయత్రీ దేవిగా అమ్మవారు



గాయత్రీ దేవిగా దర్శనమిస్తున్న అమ్మవారు



గడిమైసమ్మ అమ్మవారు



శ్రీభవానీ శివదుర్గాదేవి



బాలత్రిపుర సుందరీ దేవి అవతారంలో అమ్మవారు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీతో పాటు మండలంలోని గ్రామాల్లో దేవీ శరన్నవరాత్రులు వైభవంగా కొనసాగాయి. నవరాత్రుల్లో భాగంగా రెండవ రోజు గాయత్రీ దేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమివ్వగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూడూర్‌లో గ్రామంలో గ్రామ సర్పంచ్ బాబుయాదవ్, ఉపసర్పంచ్ మానేపల్లి వెంకటేష్, వార్డు సభ్యులు శశికుమార్‌యాదవ్, హన్మంత్‌రెడ్డి, నాయకులు పోచయ్య, నిర్వాహకులు గూడురు శ్రీధర్‌రెడ్డి, సుమన్, మల్లిఖార్జున్ పూజల్లో పాల్గొన్నారు.

భవానీ అలంకరణలో గడి మైసమ్మ

మేడ్చల్: నవరాత్రి పూజల్లో భాగంగా రెండో రోజైన సోమవారం గడిమైసమ్మ ఆలయంలో అమ్మవారు భవానీ దేవి అలంకారంలో దర్శనమిచ్చారు.



పూడూర్‌లో నవరాత్రుల పూజల్లో సర్పంచ్, నాయకులు

బాలాత్రిపుర సుందరీ అలంకరణలో..

కీసర: దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కీసరగుట్ట శ్రీభవానీ రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో కొలువైన శ్రీభవానీ శివదుర్గాదేవి అమ్మవారు సోమవారం బాలత్రిపుర సుందరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

ఆరు గ్యారెంటీలకు ప్రజల్లో మంచి స్పందన



కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న కాలనీవాసులు

బోడుప్పల్: ఆరు గ్యారెంటీ పథకంతో కాంగ్రెస్‌కి మంచి స్పందన లభిస్తోందని మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుల నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం తిరుమల మెడోస్, హేమానగర్, ఉదయ్యనగర్, రెడ్డీస్ కాలనీ, న్యూహేమానగర్ కాలనీల్లో నిర్వహించిన గడప గడప కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీ పథకాల వల్ల మేడ్చల్ నియోజకవర్గ ప్రజలు కాంగ్రెస్‌కు బ్రహ్మరథం పడతారన్నారు. మేడ్చల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేసి కాంగ్రెస్‌కు బహుమతిగా ఇస్తామన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొన్నం తరుణ్‌గౌడ్, మేడ్చల్ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, కార్పొరేటర్లు బొమ్మక్ కళ్యాణ్‌కుమార్, తోటకూర అజయ్‌యాదవ్, నేతలు బొమ్మక్ రమేష్, పోగుల వీరారెడ్డి, వెంకటేశ్‌గుప్తా, హరినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురు చేరిక

తిరుమల మెడోస్‌కు చెందిన పలువురు కాలనీ ప్రతినిధులు కాంగ్రెస్‌లో చేరారు. కాలనీ అధ్యక్షుడు అమరేందర్, ప్రధాన కార్యదర్శి వెంకట మెదిశెట్టిగుప్తా, ఉపాధ్యక్షుడు ఓరుగంటి ఆంజనేయులు గుప్తా, రసూల్ బాషా, నర్సింగ్‌రావు, కృష్ణమూర్తి, హర్షవర్ధన్, గంగాధర్, శ్రీకాంత్, బాలరాజ్, రామకృష్ణ, రమణ, శ్యాంరావు, నర్సింగ్‌రావు, రాములు, ఆంజనేయులుగౌడ్, యమునరెడ్డి, ప్రేమలత, జయమ్మ తదితరులున్నారు.

హరివర్ధన్‌రెడ్డికి టికెట్ ఎందుకు ఇవ్వలేదు..?

- సర్వే నివేదికలు బయట పెట్టాలని డిమాండ్
- ఠాక్రేను కలిసిన హరివర్ధన్‌రెడ్డి అనుచరులు



గాంధీ భవన్‌లో ఠాక్రేతో హరివర్ధన్‌రెడ్డి అనుచరులు

మేడ్చల్: మేడ్చల్ కాంగ్రెస్ టికెట్ ఆశించి భంగపడ్డ టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి అనుచరులు నగరంలోని గాంధీ భవన్ హల్‌చల్ చేశారు. బోయినపల్లిలోని హరివర్ధన్ నివాసంలో సోమవారం ఉదయం సమావేశమై హరివర్ధన్‌కు మద్దతు తెలిపారు. ఆయన నివాసం నుంచి గాంధీ భవన్‌కు వెళ్లి అక్కడ పార్టీ అధిష్టానానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సర్వే నివేదికలు బయట పెట్టాలని డిమాండ్ చేశారు. సర్వేల్లో హరివర్ధన్‌రెడ్డి మొదటి స్థానంలో నిలిచినా టికెట్ ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ప్రతి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఇద్దరు బీసీలకు టికెట్ ఇవ్వాలన్న అంశం కేవలం మల్కాజిగిరి పరిధిలోనే అమలు చేస్తున్నారా అన్ని ప్రశ్నించారు. మల్కాజిగిరిలో బీసీ నేత శ్రీధర్‌కు అన్యాయం చేసి దొరల కుటుంబం మైనంపల్లి హన్మంతరావుకు ఎలా టికెట్ కేటాయించారని నిలదీశారు. గాంధీ భవన్‌లో ఉన్న కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, స్క్రీనింగ్ కమిటీ సభ్యురాలు దీప్ దాస్ మున్షిని కలిశారు. హరివర్ధన్‌రెడ్డికి పార్టీ న్యాయం చేస్తుందని, పార్టీ అభ్యర్థి గెలుపుకోసం పనిచేయాలని నాయకులు సముదాయించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మహేష్‌గౌడ్, జైపాల్‌రెడ్డి, హేమలత, కార్తీక్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సీఎం సభ ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్‌రూరల్: ఈ నెల 18న మేడ్చల్‌లో జరిగే సీఎం కేసీఆర్ బహిరంగ సభ ఏర్పాట్లను సోమవారం మంత్రి మల్లారెడ్డి పరిశీలించారు. గుండ్లపోచంపల్లిలో నిర్వహించనున్న సభ స్థలి వద్ద జరుగుతున్న సభా వేదిక, సీఎం కేసీఆర్ హెలీప్యాడ్ ల్యాండింగ్ ప్రదేశం, పార్కింగ్ ప్రదేశాలను మంత్రి మల్లారెడ్డి పరిశీలించారు. పనులను శరవేగంగా పూర్తి చేయాలని స్థానిక నాయకులను సూచించారు. మంత్రితో నియోజకవర్గ ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, మాజీ చైర్మన్ సత్యనారాయణ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దయానంద్‌యాదవ్, బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రాజమల్లారెడ్డి, నర్సింహారెడ్డి, భాగ్యారెడ్డి, కౌన్సిలర్లు మల్లికార్జున్ ముదిరాజ్, కొడె మహేశ్, నాయకులు పాల్గొన్నారు.

వాహన తనిఖీల్లో రూ.4.12 లక్షల పట్టివేత



డబిల్‌పూర్ వద్ద చెక్‌పోస్టును పరిశీలిస్తున్న డీసీపీ శబరీష్

మేడ్చల్‌రూరల్: ఎన్నికల కోడ్ నేపథ్యంలో మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సీఐ నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే మేడ్చల్ పోలీసులు రూ.50 లక్షలకు పైగా నగదు, 180 గ్రాముల బంగారం పట్టుకున్న పోలీసులు సోమవారం మేడ్చల్– మెదక్ జిల్లాల సరిహద్దులో డబిల్‌పూర్ చౌరస్తా సమీపంలో 44వ జాతీయ రహదారిపై నిర్వహించిన వాహన తనిఖీల్లో భాగంగా నిజామాబాద్ నుంచి నగరం వైపు కారులో వెళ్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారి శివప్రణయ్ వద్ద రూ.4.12 లక్షల నగదు పట్టుకున్నారు. నగదుకు సంబంధించి ఆధారాలు చూపకపోవడంతో పోలీసులు సీజ్ చేశారు. ఎన్నికల నేపథ్యంలో డబిల్‌పూర్ చౌరస్తా వద్ద జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ను మేడ్చల్ డీసీపీ శబరీష్ సోమవారం సందర్శించి వాహనాల తనిఖీని పర్యవేక్షించారు. ఎస్‌ఐ శంకర్‌గౌడ్‌ను తనిఖీల వివరాలను డీసీపీకి వివరించారు. సిబ్బందికి డీసీపీ పలు సూచనలు చేశారు.

తనిఖీల్లో నగదు పట్టివేత

జవహర్‌నగర్: ఎన్నికల కోడ్ నేపథ్యంలో జవహర్‌నగర్ పోలీసులు సోమవారం పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. అంబేద్కర్‌నగర్ వద్ద ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.4.5 లక్షలు, యాప్రాల్ వద్ద రూ.7.6 లక్షలు సీజ్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ సీతారాం తెలిపారు. ప్రతి వాహనదారుడు ఎన్నికల నిబంధనలు పాటించాలని ఆయన సూచించారు.

యువత చూపు.. ఎటువైపు..?

- దాదాపు 67 శాతం యువఓటర్లే..
- వారు ఎటువైపు మొగ్గు చూపితే..
- ఆ పార్టీ అభ్యర్థి గెలుపు ఖాయం..
- వారిని ప్రసన్న చేసుకునే దిశగా..
- అన్ని పార్టీల ప్రయత్నాలు



ఉప్పల్: ఉప్పల్ నియోజవర్గంలో యువ ఓటర్లతోనే అభ్యర్థుల భవితవ్యం ముడిపడి ఉంది. వారు ఎటువైపు మొగ్గు చూపితే వారే గెలిచే పరిస్థితి ఉప్పల్‌లో ఉంది. దీనికి కారణం యువకులే పెద్ద మొత్తంలో ఓటర్లుగా ఉండటం. ఉప్పల్ నియోజకవర్గంలో మొత్తం 5,10,187 ఓటర్లు ఉన్నారు. 20 నుంచి 29 వయస్సు గల ఓటర్లు 79,206 ఉండగా 30 నుంచి 39 మధ్య వయస్సుగల వారు 1,44,042 మంది ఓటర్లు, 40 నుంచి 49 మధ్య వయస్సు గల వారు 1,23,432 మంది ఓటర్లు అంటే 3,46,680 ఓటర్లు 20 నుంచి 49 మధ్య వయస్సు గల వారే ఉండటం గమనార్హం. దాదాపు 67 శాతానికి పైగా యువ ఓటర్లే ఉన్నారు. కొత్తగా ఓటు హక్కు సంపాదించుకున్న వారు 7,097 ఉన్నారు. యువతరం ఏ పార్టీ వైపు మొగ్గుచూపితే.. ఆ పార్టీ అభ్యర్థి గెలిచే అవకాశం ఉన్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. మొత్తం ఓటర్లతో పురుషులు, మహిళలు దాదాపుగా సమాన నిష్పత్తిలో ఉన్నారు. పురుషులు 2,65,493 ఉండగా మహిళా ఓటర్లు 2,44,657 మంది ఉన్నారు. యువతను ప్రసన్నం చేసుకునే దిశగా అన్ని పార్టీల అభ్యర్థులు ప్రయత్నాలు చేస్తున్నారు.